
మెదక్ సభలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్



హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ గల్లంతు

- బెల్ట్ షాపులు మూసేస్తామని మాట తప్పారు
- మాజీ మంత్రి ఈటల రాజేందర్

మెదక్ అర్బన్/రామాయంపేట, ఫిబ్రవరి 27: హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్‌ను ప్రజలు గల్లంతు చేస్తారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర మంగళవారం రామయంపేట, మెదక్ మున్సిపాలిటీల్లో కొనసాగింది. మెదక్, రామాయంపేటలో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ మహిళలకు రూ.2,500, రైతుబంధు రూ.15 వేలు, కౌలు రైతుకు రూ.12 వేలు, ఆటోడ్రైవర్లకు రూ.12 వేలు, మహిళలకు వడ్డీలేని రుణాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ. 2లక్షల వరకు రైతు రుణాలుమాఫీ ఏమైందని ప్రశ్నించారు. బెల్ట్‌షాపులను మూసేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. హామీలను అమలు చేయకపోతే కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికీ పడుతుందని అన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో కేసీఆర్ అబద్ధపు పునాదులపై పాలన సాగించారని, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు.

బీజేపీని ఆశీర్వదించాలి

ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచంలోనే భారతదేశానికి గుర్తింపు తెచ్చారని ఈటల పేర్కొన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ. 10 లక్షలు ఇస్తున్నారని తెలిపారు. దేశంలో 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించారని, పేదల సొంత ఇంటి కలను నేరవేర్చేందుకు 4 కోట్ల ఇళ్లను నిర్మించిన ఘనత మోదీకి దక్కిందని పేర్కొన్నారు. అవినీతి మరక లేని నాయకుడు మోదీ అని ఆయన కొనియాడారు. కరోనా సమయంలో ఇతర దేశాలకు వ్యాక్సిన్ అందించిన ఘనత మోదీదేనని గుర్తుచేశారు. కరోనా కాలంలో ప్రతీ మనిషికి 5 కిలోల ఉచిత బియ్యం అందించి ఆకలి తీర్చారని కొనియాడారు. ఒకప్పుడు కంపు కొడుతున్న రైల్వేస్టేషన్ల నేడు అద్దంలా మెరిసిపోతున్నాయన్నారు. ప్రధాని మోదీ అభివృద్ధికి మద్దతుగా బీజేపీకి ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. సభలో బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ, మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పరిణీత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ఎంఎస్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ పటేల్, నాయకులు సుభాష్‌గౌడ్, అల్లం మధు, ఆకుల రాము, నాగరాజు, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

చిదిమేస్తున్న అతివేగం

- నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణాలు
- రోడ్డు భద్రతా నిబంధనలు పాటించని వాహనదారులు
- జరిమానాలు విధిస్తున్నా మారని తీరు
- హైవేల పక్కన గ్రామాల వద్ద కనిపించని సర్వీస్ రోడ్లు
- రోడ్లకు ఇరువైపులా దాబాలు, మద్యం సిట్టింగ్‌లు
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా మారని తీరు

రోడ్డు నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిగా వాహనాలు నడుపుతూ జిల్లాలో అనేక మంది ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోవడమో.. తోటివారి ప్రాణాలు తీయడమో జరుగుతున్నది. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం కారణంగానే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పోలీసుల విచారణలో తెలుస్తున్నది. పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నా, జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు.


అల్లాదుర్గం వద్ద బోల్తాపడిన ట్యాంకర్



- **తేదీ : ఫిబ్రవరి 7**
  నర్సాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు జిన్నారం మండలం రాళ్లకత్వ వద్ద చెట్టును ఢీకొట్టడంతో 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగంమే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు పేర్కొన్నారు. చెట్టును ఢీకొన్న బస్సు పక్కనే ఉన్న గోతిలో పడి వుంటే పెద్ద ప్రమాదమే జరిగేది.
- **తేదీ : ఫిబ్రవరి 12**
  నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సు నిజాంపేట వైపు వెళ్తుండగా డీఎస్‌టీ తండా సమీపంలో నిజాంపేట-నారాయణఖేడ్-బీదర్ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు స్వల్పంగా దగ్ధమైంది. ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు.
- **తేదీ : ఫిబ్రవరి 21**
  ముగ్గురు స్నేహితులు కారులో శ్రీశైలం నుంచి కారులో నౌబాద్‌కు వెళ్తుండగా జహీరాబాద్ పట్టణంలోని అల్గోల్ చౌరస్తా వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో బీదర్ జిల్లా నౌబాద్‌కు చెందిన శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.
- **తేదీ : ఫిబ్రవరి 23**
  ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం చెందారు. ఓఆర్ఆర్‌పై శామీర్‌పేట నుంచి సంగారెడ్డి వైపు వస్తుండగా సుల్తాన్‌పూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే అక్కడికక్కడే మృతిచెందగా డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.

సంగారెడ్డి క్రైమ్, ఫిబ్రవరి 27 : ఇటీవల విస్తరించిన సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి ప్రమాదాలకు నెలవుగా మారింది. కొత్తగా నిర్మించినా కొన్ని ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు, ఫ్లైఓవర్లు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రమాదాల బారిన ఎడుతున్నారు. దీనికి తోడు వాహనదారులు అతివేగంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అల్మాయిపేట, శివ్వంపేట, సుల్తాన్‌పూర్, చౌటకూర్ తదితర గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు సరిగ్గా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు పైకి రావాలంటేనే జంకుతున్నారు. ఈ నేపథ్యంలో అందోల్ మండలం డాకూరు శివారులో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రోడ్డు పక్కన కారును ఆపుకుని నిల్చున్న వారిని ట్యాంకర్ ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అతివేగంగా నడుపుతూ ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్ కూడా మరో ముప్పై కిలోమీటర్ల అనంతరం ట్యాంకర్ బోల్తాపడి మృతిచెందాడు.



హైదరాబాద్-ముంబాయి హైవే పైనా..

హైదరాబాద్-ముంబాయిని కలిపే 65వ నంబరు జాతీయ రహదారిపై కూడా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ హైవేపై ప్రతీరోజు వేల సంఖ్యలో భారీ వాహనాలు తిరుగుతుంటాయి. ముఖ్యంగా షిర్డికి ప్రైవేట్ ట్రావెల్స్ ఎక్కువగా వెళ్తుంటాయి. సంగారెడ్డి నుంచి జహీరాబాద్ వరకు రోడ్డుకు ఇరువైపులా దాబాలు ఉన్నాయి. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు దాబాలు నిర్వహిస్తుండటంతో రద్దీ విపరీతంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ రోడ్డును ఆరు లైన్లుగా విస్తరిస్తున్నారు. దీంతో సాయంత్రం రద్దీ సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. అలాగే కొన్ని దాబాల్లో మద్యం సిట్టింగ్‌లు కూడా నిర్వహిస్తుండటంతో మద్యం సేవించి వాహనాలను నడుపుతున్నారు. దీంతో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఈ జాతీయ రహదారిపై ట్రాఫిక్ పోలీసులు కొన్ని యాక్సిడెంట్ స్పాట్లను గుర్తించారు. మల్కాపూర్, పెద్దాపూర్, సదాశివపేట, బుదేరా, కంకోల్, జహీరాబాద్ తదితర ప్రాంతాల వద్ద యాక్సిడెంట్ స్పాట్లు గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ రహదారి పక్కనే ఉన్న గ్రామాల ప్రజలు రాత్రివేళల్లో రోడ్డు మీదుకు రావాలంటేనే జంకుతున్నారు. మరోవైపు జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు



రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రోడ్డు నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. మద్యం సేవించడం, అతివేగంగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు నిబంధనలను అందరూ పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు. మద్యం తాగి వాహనాలను నడుపవద్దు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలి. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తాం. వాహనదారులు బాధ్యతగా వ్యవహరిస్తేనే ప్రమాదాలను అరికట్టడం సాధ్యమవుతుంది.

-చెన్నూరి రూపేష్, సంగారెడ్డి ఎస్పీ

మూడేళ్లలో జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	2021	2022	2023
ప్రమాదాలు	729	798	807
మృతులు	433	466	411
క్షతగాత్రులు	655	754	774

వాహనాల తనిఖీలు	2021	2022	2023
కేసులు	2,67,232	2,89,244	2,44,593
జరిమానాలు	19,20,06,690	12,11,68,987	9,59,53,273

డ్రంకెన్ డ్రైవ్ కేసులు	2022	2023
కేసులు	6,369	11,404
జరిమానాలు	69,42,795	1,15,55,200
జైలు శిక్ష	50	39

అయ్యో పాపం..

- నెల రోజుల్లో తండ్రవుతాడని సంతోషం.. అంతలోనే ప్రమాదంలో దుర్మరణం
- చేతికి వచ్చిన కొడుకులను కోల్పోయిన తల్లిదండ్రుల వేదన
- మూడు కుటుంబాల్లో విషాదం నింపిన రోడ్డు ప్రమాదం


మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తదితరులు

జోగిపేట, ఫిబ్రవరి 27: సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణ శివారులో సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ప్రమాదంలో జోగిపేటకు చెందిన మహ్మద్ వాజీద్ (27), హాజీ హుస్సేన్ (25), ముక్రమ్ (23) మృతిచెందారు. మృతుల్లో ఒకరైన వాజీద్ భార్య నిండు గర్భిణి. ఆమె వచ్చే నెలలో బిడ్డకు జన్మనివ్వనున్నది. ఇంతలోనే భర్త మృత్యువాత పడడంతో తట్టుకోలేక అపస్మారక స్థితికి చేరుకుంది. వాజీద్ తల్లిదండ్రులు, భార్య రోదన అందరినీ కలచి వేసింది. అలాగే, చేతికి వచ్చిన కొడుకులు మృతిచెందడంతో హాజీ, ముక్రమ్‌ల కుటుంబ సభ్యులు కూడా గుండెలవిసేలా రోధించారు. ప్రమాదం జరిగిన సంగతి తెలుసుకున్న ఎస్ఐ అరుణ్‌గౌడ్ సిబ్బందితో కలిసి ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాలను జోగిపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిన రిజ్వాన్‌ను జోగిపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి

ప్రమాదంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ జోగిపేటలో ఏరియా ఆస్పత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ నాయకుడు వాజీద్ మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

జోగిపేటలో విషాదఛాయలు

ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలవడంతో జోగిపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే మృతుల స్నేహితులు, కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి తరలివచ్చారు. పోస్ట్‌మార్టం అనంతరం అంత్యక్రియలకు పట్టణవాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

అవిశ్వాస రాజకీయం ఏ మలుపు తిరిగేనో?

- కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతే కీలకం
- ఎమ్మెల్యే చింతాకు తలనొప్పిగా మారిన సంగారెడ్డి బల్దియా అవిశ్వాస తీర్మానం

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 27 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవిపై అదే పార్టీకి చెందిన వైస్ చైర్ పర్సన్ లతా విజయేందర్‌రెడ్డితో పాటు మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అవిశ్వాస తీర్మానంపై వచ్చే నెల 7వ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు అధికారులు ప్రకటించారు. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు రెండుగా చీలిపోయి చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు తలనొప్పిగా మారింది. త్వరలో పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అవిశ్వాసం పెట్టడంతో పార్టీకి నష్టం జరుగుతుందనే సంశయంలో చింతా ప్రభాకర్ ఉన్నారు. ఒకవేళ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గినా.. వీగిపోయినా ఆమె బీఆర్ఎస్‌ను వీడితే జరిగే పరిణామాలను అంచనా వేస్తున్నారు. మరోవైపు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానానికి సహకరించాలని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు చింతాను ఒప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది.

కాంగ్రెస్ మద్దతుపై సందిగ్ధం

మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గాలంటే 26 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం ఉంటుంది. ఈ బల్దియాలో మొత్తం 38 మంది కౌన్సిలర్లకు గానూ కాంగ్రెస్‌కు చెందిన 17వ వార్డు కౌన్సిలర్ రెండేళ్ల క్రితం మరణించడంతో ప్రస్తుతం 37 మంది కౌన్సిలర్లు ఉన్నారు.



వీరిలో బీఆర్ఎస్ నుంచి 18 మంది, కాంగ్రెస్ నుంచి 11 మంది, ముగ్గురు బీజేపీ, ఇద్దరు ఎంఐఎం, ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. కాగా ముగ్గురు స్వతంత్ర కౌన్సిలర్లు అప్పట్లో బీఆర్ఎస్‌లో చేరగా బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. అయితే ప్రస్తుతం బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన 24 మంది కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం కోసం సంతకాలు చేశారు. కానీ, పదిహేను రోజులుగా మారిన రాజకీయ సమీకరణల వల్ల నలుగురు కౌన్సిలర్లు అవిశ్వాసంపై వెనక్కి తగ్గారు. దీంతో చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ప్రస్తుతం 20 మంది ఉన్నట్టు తెలిసింది. అవిశ్వాసం నెగ్గాలంటే 26 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. దీంతో కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు తమకు మద్దతు ఇస్తారని చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న ఓ కౌన్సిలర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ నుంచి ఒక్కరూ కూడా బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వరాదని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కౌన్సిలర్లకు చెప్పినట్టు తెలిసింది. మరోవైపు అవిశ్వాసం నుంచి గట్టెందుకు చైర్‌పర్సన్ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎంఐఎం, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్ల మద్దతును కూడగట్టినట్టు తెలిసింది. దీంతో బీఆర్ఎస్‌కు లోపాయికారిగా మద్దతిస్తారని ప్రచారం జరుగుతున్న ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎవరోననే దానిపై ఉత్కంఠ నెలకొన్నది.

మెదక్ మున్సిపల్ బడ్జెట్ రూ.50.91 కోట్లు

- ఖర్చుతో పోలిస్తే రూ.2 లక్షల మిగులు
- గతేడాది కంటే రూ.17 కోట్లు పెరిగిన రాబడి
- సమావేశం చివరలో కౌన్సిలర్ మామిళ్ల తీరుపై ఎమ్మెల్యే గరం గరం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27: మెదక్ మున్సిపల్ 2024-25 సంవత్సర బడ్జెట్ 50.91 కోట్లుగా ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. మంగళవారం జరిగిన సమావేశానికి మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ అధ్యక్షత వహించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం అకౌంటెంట్ ఆదాయ, వ్యయ ఖర్చులను సభ్యులకు వివరించారు. 2024-25 సంవత్సరానికి గాను ఆదాయం రూ.50.91 కోట్లు కాగా, రూ. 50.89 కోట్లు వ్యయం కానున్నట్టు బడ్జెట్‌లో చూపారు. గత సంవత్సరంతో పోలిస్తే రూ.17 కోట్ల ఆదాయం పెరిగినట్లు తెలుస్తోంది. ఖర్చులు కూడా అదే విధంగా పెరుగుతున్నట్లు లెక్కల్లో చూపారు. ఇందులో ముఖ్యంగా ఆస్తి పన్ను ద్వారా రూ.551 లక్షలు, అద్దెల రూపంలో రూ.77.81 లక్షలు, ప్రజారోగ్య, పారిశుద్య విభాగాల నుంచి రూ.19.69 లక్షలు, పట్టణ ప్రణాళికా విభాగం ద్వారా రూ.201.30 లక్షలు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా 136.70 లక్షలు, డిపాజిట్లు, రుణాల ద్వారా రూ.33 లక్షలు, డి గ్రాంట్స్ ద్వారా రూ.387 లక్షలు, నాన్‌ప్లాన్ ద్వారా రూ.125 లక్షలు, ప్లాన్ గ్రాంట్స్ ద్వా రా రూ.3,560 లక్షలు, ఇతర గ్రాంట్స్ ద్వారా రూ.4,072 లక్షల ఆదాయం రానున్నట్లు బడ్జెట్‌లో వివరించారు. ఇక ఖర్చుల వివరాలకొస్తే సిబ్బంది వేతనాలు, ప్రజారోగ్య, పారిశుధ్య విభాగం, విద్యుత్, రుణాలు, గ్రీన్‌బడ్జెట్, ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్, పట్టణ ప్రణాళిక, నిల్వ బడ్జెట్, పబ్లిక్ ఎమినిటీస్, వార్డుల వారీగా చేయాల్సిన ఖర్చులు, డిపాజిట్లు, ఇతరత్రా, ప్లాన్, నాన్‌ప్లాన్, ఇతర గ్రాంట్స్ ఖర్చుల కింద మొత్తం రూ.50.89 కోట్లను కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు.


బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

మున్సిపల్ అభివృద్ధి కోసం అందరిని కలుపుకొని పోతానని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేవలం బడ్జెట్‌తో సమస్యలు తీరవని.. మరిన్ని నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తానన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్‌గౌడ్, కమిషనర్ జానకిరాంసాగర్, డీఈ మహేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తమాషాలు చేస్తున్నావా..

కౌన్సిలర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం

బడ్జెట్ సమావేశం చివరలో గత ప్రభుత్వ పథకాల అమలుతీరుపై వైస్‌చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్‌గౌడ్ ఎమ్మెల్యే రోహిత్‌ల మధ్య చర్చ జరుగుతుండగా 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు కల్పించుకుని ఇది మున్సిపల్ బడ్జెటా.. లేక రాష్ట్ర బడ్జెటా అంటూ లేచి సభను నిలదీశారు. దీంతో 'ఇన్నేళ్ల కాలం ఏం పనులు చేశారో.. ప్రజలు నాకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసే దిశగా మాట్లాడుతుంటే మధ్యలో కల్పించుకోవడమేంటి.. ఏం తమాషా చేస్తున్నావా?' అంటూ ఎమ్మెల్యే అతడిపై మండిపడ్డారు. మొన్నటి వరకు బీఆర్ఎస్‌ను తిట్టిన నువ్వు రూ.10లక్షల కోసం అదే పార్టీకి అమ్ముడుపోయావని ఆరోపించారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉందిగా.. అప్పుడెందుకు అభివృద్ధి, నిధుల గురించి ప్రశ్నించలేదని కౌన్సిలర్‌ను ప్రశ్నించారు. స్వార్థ రాజకీయాల కోసం పార్టీలు మారే వారిని ప్రజలు తరిమి కొడతారన్నారు. సభ ముగిసిన అనంతరం అందరూ వెళ్లిపోయే సమయంలో కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు తనంతట తానుగా ఎమ్మెల్యే వద్దకు వెళ్లి తాను ఏదైనా తప్పుగా మాట్లాడితే క్షమించాలని కోరుతూ రోహిత్‌తో కరచాలనం చేశారు. తర్వాత ఇద్దరు కలిసి ఫొటోలకు ఫోజులిచ్చారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న పరశురాములు

కొండపాక, ఫిబ్రవరి 27: అప్పుల బాధతో ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిరిసిల్ల జిల్లా సారంపల్లి గ్రామానికి చెందిన బొప్పెన పరశురాములు చిట్టీలు నిర్వహించి అప్పుల పాలయ్యాడు. బతుకు దెరువు కోసం కొన్నేళ్లు దుబాయ్‌కి వెళ్లి వచ్చినా అప్పులు తీరలేదు. దీంతో మనస్తాపం చెంది ఈనెల 23న తిరుపతికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. మంగళవారం ఉదయం కుకునూరుపల్లి మండలం లకుడారం శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు ఆయన వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

రైతుల ఖాతాల్లో రూ.5 కోట్లు జమచేశాం



కొత్తూర్(బి) గ్రామంలో గల ట్రైడెంట్ కర్మాగారం

జహీరాబాద్, ఫిబ్రవరి 27: జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో గల ట్రైడెంట్ చెరకు కర్మాగారం యాజమాన్యం మంగళవారం రూ.5 కోట్ల పెండింగ్ బకాయిలను రైతుల ఖాతాల్లో వేసిందని ట్రైడెంట్ కర్మాగారం డైరెక్టర్ ఖిజార్‌యాపై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్మాగారం రైతులకు రూ.7.38 కోట్ల చెరకు బకాయిలను చెల్లించాల్సి ఉండగా.. ప్రస్తుతం రూ.5 కోట్లు జిల్లా అధికారుల సూచనలతో రైతుల ఖాతాల్లో వేశామన్నారు. మిగిలిన రూ.2.38 కోట్ల బకాయిలను మార్చి 5 వరకు చెల్లిస్తామని ఆయన వివరించారు. కర్మాగార యాజమాన్యంలో ఏర్పడిన అంతర్గత విబేధాల కారణంగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇక మీదట రైతులకు చెరకు బిల్లుల పెండింగ్ అనే సమస్య ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 28న కర్మాగారం వేలం వేసేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించిన నేపథ్యంలో యాజమాన్యం స్పందించి జిల్లా అధికారుల సమక్షంలో రైతుల ఖాతాల్లో వేసినట్లు సమాచారం. ఈ మేరకు తమ ఖాతాల్లోకి చెరకు బిల్లులకు సంబంధించి నగదు చేరిందని పలువురు రైతులు వివరించారు.

ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 27: ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. సిద్దిపేట పట్టణ శివారులోని నాగదేవత టెంపుల్ చౌరస్తా నుంచి సిద్దిపేటకు మంగళవారం ఉదయం నెంబరు ప్లేట్ లేకుండా రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని నమ్మదగిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు కలిసి దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, రేషన్ బియ్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే 8712667447, 8712667446 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

» విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

» ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి

» తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?

» ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం

» ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్‌ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్‌ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

» హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?

» నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం

» కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?

» కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

» నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

» ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి

» సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

చక్రియాల్‌ను సందర్శించిన జపాన్ బృందం

● వ్యవసాయ రంగంపై అధ్యయనం



చక్రియాల్‌లో పర్యటిస్తున్న జపాన్ బృందం

పుల్‌కల్, ఫిబ్రవరి 27: చౌటకూర్ మండలం చక్రియాల గ్రామాన్ని ఐఐటీ కంది వారి సౌజన్యంతో జపాన్ బృందం మంగళవారం సందర్శించింది. గ్రామంలో వ్యవసాయం ఏ విధంగా చేస్తున్నారు, సేద్యంలో తలెత్తుతున్న ఇబ్బందులు, పంటల దిగుబడులు, మార్కెటింగ్ తదితర అంశాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి సేద్యానికి వినియోగిస్తున్న పరికరాలను పరిశీలించి వాటి పనితీరును తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. గ్రామాన్ని సందర్శించిన వారిలో సుజూకీ కంపెనీకి చెందిన రమ, వుకీ, కియా మాథ్యూ, లియోక్త, అకిర, కిరోకి, సతోరాలు ఉన్నారు. వీరి వెంట మండల వ్యవసాయ అధికారి చైతన్య ఏఈవో మనిషా, రైతులు గాజుల సుభాష్‌బాబు, రోళ్లపాటి మల్లేశం, మన్నె నర్సింహులు, తుంగె మల్లేశం ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారు ఆభరణాలు..

తూప్రాన్, ఫిబ్రవరి 27: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళకు చెందిన బ్యాగులో ఉన్న బంగారు అభరణాలు చోరీ అయిన సంఘటన తూప్రాన్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఈఎస్‌ఐ ప్రాంతంలో నివాసముండే తూప్రాన్‌కు చెందిన ఉప్పల శ్వేత తూప్రాన్‌లో జరిగిన శుభకార్యానికి సోమవారంరాత్రి హాజరైంది. మంగళవారం మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్దకు వెళ్లిన తర్వాత బ్యాగును తెరిచిచూడగా అందులో ఉన్న 12.5 తులాల బంగారు అభరణాలు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం వివరించారు.

గోమారంలో 11తులాల బంగారు ఆభరణాల చోరీ

శివ్వంపేట: మండల పరిధిలోని గోమారం గ్రామంలో ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు అభరణాలు, నగదు అపహరించుకపోయిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోమారం గ్రామానికి చెందిన గంగిరెడ్డి మల్లారెడ్డి కుటుంబీకులు మంగళవారం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో చూడగా బీరువాలో ఉన్న 11తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి..

శివ్వంపేట, ఫిబ్రవరి 27: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన శివ్వంపేట మండలం చండి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బంగారుగాని కుమార్(35) మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డిని వివరణకోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

గాయపడిన పెయింటర్ చికిత్స పొందుతూ మృతి

తూప్రాన్, ఫిబ్రవరి 27: మెట్లు దిగుతూ కిందపడిన పెయింటర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ అడ్డగుట్టకు చెందిన పెయింటర్ పెద్దింటి వినోద్(40) వారంరోజుల క్రితం తూప్రాన్‌కు వెళ్లి, తూప్రాన్‌కు చెందిన పెయింటర్ జాంగీర్ వద్ద పనులు చేస్తున్నాడు. 23న సాయంత్రం మెట్ల మీద నుంచి దిగుతుండగా కిందపడి గాయపడ్డాడు. చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● మెదక్ కలెక్టర్ రాజర్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 27: పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు మెదక్ కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, అకౌంటింగ్ టీం, నోడల్ ఆఫీసర్ల శిక్షణలో కలెక్టర్ మాట్లాడారు. గత ఎన్నికల్లో అనుభవాలను పరిగణలోకి తీసుకొని రానున్న లోక్‌సభ ఎన్నికలను నోడల్ ఆఫీసర్లకు కేటాయించిన విధులను విజయవంతంగా నిర్వహించాలన్నారు. సెక్టోరల్ ఆఫీసర్లకు ట్రైనింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎం, కమీషనింగ్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, పోస్టల్ హోం ఓటింగ్, ఈవీఎం మేనేజ్‌మెంట్ ర్యాండమైజేషన్ పోలింగ్ పర్సన్స్ డేటా ఎంట్రీ సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ డేటా ఎంట్రీ, 7 అసెంబ్లీ సెగ్మెంట్లు నుంచి డైలీ వారి రిపోర్టులు, ఓటర్ హెల్ప్‌లైన్ తదితర అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నోడల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి: కలెక్టర్

పార్లమెంటరీ సంస్థల పనితీరును యువత అర్థం చేసుకునేందుకు యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వశాఖ ఎన్‌వైకేఎస్ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ నిర్వహిస్తున్నదని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓగార్డెన్‌లో జరిగిన జిల్లాస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా వారు పూర్తి సామర్థ్యాన్ని గ్రహించి దేశ నిర్మాణానికి సహకరించేందుకు ఈ వేదికలు ఉపయోగపడుతాయన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలి

డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన 2కె పాదయాత్రను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలందరూ బ్యాంకు సేవలను వినియోగించుకొని, సైబర్ నేరాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ సూచించారు.

నీటి యాజమాన్య ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలి

● జిల్లా వ్యవసాయ శాఖాధికారి నర్సింహారావు



సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతువేదిక వద్ద శిక్షణ పొందిన ఏఈవోలతో జిల్లా వ్యవసాయాధికారులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 27: రైతులకు నీటి యాజమాన్య ప్రాధాన్యంపై ఏఈవోలు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి నర్సింహారావు సూచించారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల్లో పంట సాగుపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందనే విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఏఈవోలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. నాగేందర్, ఈఈ నాగేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ సంచాలకులు సునీత, మనోహర, ఏవో ఏబీజీకే ప్రసాద్, ఏఈవోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఫిన్లాండ్ దేశస్థులు



చిన్నారులకు అందిస్తున్న సేవల గురించి తల్లులను అడిగి తెలుసుకుంటున్న ఫిన్లాండ్ దేశ హెల్సింకి యూనివర్సిటీ బృందం సభ్యులు

కొండాపూర్, ఫిబ్రవరి 27: కొండాపూర్ మండల పరిధిలోని చెర్లగోపులారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఫిన్లాండ్ దేశస్థులు మంగళవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఎలా పనిచేస్తున్నాయి.. చిన్న పిల్లల్లో మైండ్ ఇంప్రూవ్‌మెంట్ ఎలా ఉన్నదని ఫిన్లాండ్ దేశ హెల్సింకి యూనివర్సిటీ బృందం సభ్యులు ఆరాతీశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నేర్పుతున్న పాఠాలు, ఆటలు, పౌష్టికాహారం, సమయ పాలన తదితర విషయాల గురించి అంగన్‌వాడీ టీచర్ అనసూయను అడిగి తెలుసుకున్నారు.

మానసిక ఒత్తిడితో సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో బలవన్మరణం



కాశీవిశ్వనాథ్ మృతదేహం

పటాన్‌చెరు, ఫిబ్రవరి 27: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో మానసిక ఒత్తిడితో సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గాహోమ్స్ ఫేజ్2లో నివాసం ఉండే సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈవో కిల్లాటి కాశీవిశ్వనాథ్(38) మంగళవారం తెల్లవారుజామున తన ఇంట్లోని మొదటి అంతస్తులో కిటికీకి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య వినీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా కాశీవిశ్వనాథ్ మాదాపూర్‌లోని ఎక్లాట్ ప్రైమ్ అనే సొంత సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించి సీఈవోగా వ్యవహరిస్తున్నారు. ఆరు నెలల క్రితం అమెరికా వెళ్లి అక్కడ సైతం మరో సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించారు. సంస్థలు సరిగా నడవకపోవడంతో ఇటీవల హైదరాబాద్ తిరిగి వచ్చారు. వ్యాపారంలో ఒత్తిడి ఎక్కువ కావడంతో మానసికంగా కృంగిపోయారు. ఈ క్రమంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఎస్‌ఐ రమణ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



వెంకటేష్‌గౌడ్(ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 27: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కోనాయిపల్లి పిటి గ్రామానికి చెందిన వెంకటేష్‌గౌడ్(48) భార్యతో కలిసి కొంతకాలంగా దండుపల్లి గ్రామంలో అద్దెకు ఉంటున్నారు. ఇంటి పక్కనే ఉన్న ఐటీఎల్ పరిశ్రమలో వెంకటేష్‌గౌడ్ 25 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనోవేదనకు గురై సోమవారం రాత్రి తాను పనిచేసే పరిశ్రమ వెనకాల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారమందించారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు



జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడు, ప్రజాప్రతినిధులు

కంగ్టి, ఫిబ్రవరి 27: నర్సాపూర్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని దెగుల్‌వాడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెంది విద్యార్థినులు బంగారు, వెండి, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో గల దెగుల్‌వాడికి చెందిన అపూర్వరెడ్డి బంగారు పతకం సాధించగా, సానియా వెండి, అక్షిత, భాగ్యశ్రీలు కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థినిలను ప్రధానోపాధ్యాయులు శంశోద్దీన్, మాజీ ఎంపీటీసీ సుశీల గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, నందిని, ఎంపీపీ సంగీత, జడ్పీటీసీ లలిత అభినందించారు.

రెండు హామీల అమలుపై కాంగ్రెస్ నాయకుల సంబురాలు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 27: కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ హామీలను అమలుచేసిన సందర్భంగా మంగళవారం పటాన్‌చెరులో కాంగ్రెస్ శ్రేణులు, లబ్ధిదారులు సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం ఆవరణలో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంకగాంధీ, మల్లిఖార్జున్‌ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరుగ్యారంటీ పథకాలే రాన్ను పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని సీట్లను కాంగ్రెస్ గెలుస్తుందన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సామయ్య, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు మతిన్ బేగ్, యువరాజ్, అతిక్, హమీద్, రాజు, వడ్డెగోపాల్, కుంచాలకిషన్, ఫయాజ్, హాశం తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి
- కలెక్టరేట్‌లో పుస్తకావిష్కరణ

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 27: బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై యూనిసెఫ్ ఢిల్లీ ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించి, ప్రజలను చైతన్యవంతులను చేయాలని కలెక్టర్ సూచించారు. బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడంతో పాటు బాల్య వివాహానికి హాజరైన వారు కూడా శిక్షార్హులేనని హెచ్చరించారు. ఈ విషయాలపై విస్తృత ప్రచారం చేయాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజలందరూ తమ వంతు బాధ్యతగా బాల్య వివాహాలను అరికట్టేందుకు నడుం బిగించాలని ఆమె కోరారు. బాల్య వివాహాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి యూనిసెఫ్ ఆధ్వర్యంలో పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమని కలెక్టర్ క్రాంతి కొనియాడారు. ఈ పుస్తకాన్ని ప్రతి గ్రామానికి చేరవేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ ఢిల్లీ జైరుషిలింగో, జలీమ్ బి తాఫ్సీ, రాష్ట్ర బృంద సభ్యులు మురళి, దావిద్, జిల్లా మహిళా సంక్షేమాధికారి లలితకుమారి, సీడబ్ల్యూసీ వెంకటేశం, సీడీపీవో రేణుక, డీసీపీవో రత్నం, లింగం తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి

భరోసా కేంద్రం సందర్శన

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డిలోని భరోసా కేంద్రాన్ని యూనిసెఫ్ ఢిల్లీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్, భరోసా కేంద్రం నోడల్ అధికారిగా వ్యవహరించిన అదనపు ఎస్పీ అశోక్ మాట్లాడుతూ.. భరోసా కేంద్రం ద్వారా జిల్లాలో మూడున్నర సంవత్సరాలుగా పోక్సో, అత్యాచార కేసుల్లో సిబ్బంది అందించిన సేవలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా యూనిసెఫ్ బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డాక్టర్ జ్యోతి, భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ ఎస్ఐ నాగలక్ష్మి, కో ఆర్డినేటర్ దేవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మెదక్ జిల్లాలో 30 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 13,172 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరంలో 17,665 మంది, ద్వితీయ సంవత్సరంలో 18,488 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 8 గంటల వరకు పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాల్సి ఉంటుంది. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తుతోపాటు 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

హాల్‌టికెట్స్ ఇవ్వని కళాశాలపై చర్యలు తీసుకోవాలి

నారాయణఖేడ్: ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులకు బకాయి ఫీజులు చెల్లిస్తేనే హాల్‌టికెట్లు ఇస్తామని ఇబ్బందులకు గురిచేస్తున్న నారాయణఖేడ్‌లోని ఒకేషనల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ టెంకటి కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం నాయకులు అశోక్, ఇసాక్, ప్రవీణ్ తదితరులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి విద్యార్థులకు నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జిన్నారం, ఫిబ్రవరి 27: జిన్నారం మండలం మాదారం గ్రామ శివారులోని బ్రిడ్జి సమీపంలో మంగళవారం గుర్తు తెలయని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి ముఖంపై గాయలు ఉండడంతో హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని బొల్లారం పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని బొల్లారం సీఐ నయీముద్దీన్ పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్‌పై దుష్ప్రచారాలు చేయొద్దు

కొండాపూర్: మండల పరిధిలోని మల్కాపూర్ సంయుక్త ప్రైవేటు స్కూలుపై కొందరు దుష్ప్రచారాలు చేయడం తగదని స్కూల్ డైరెక్టర్ రితేష్‌గౌడ్, ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు. స్కూల్‌ను నిర్వహించేందుకు కావాల్సిన అన్ని అనుమతులు ఉన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం, ఉన్నత అధికారుల నుంచి అనుమతులు వచ్చిన తర్వాతే అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. స్కూల్‌పై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు.

కాంగ్రెస్ మండల కమిటీ ఎన్నిక

చిన్నశంకరంపేట: కాంగ్రెస్ పార్టీ చిన్నశంకరంపేట మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మనోజ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పడాల సిద్ధిరాములు ఎన్నికయ్యారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

రాయికోడ్: మండల కేంద్రమైన రాయికోడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల వసతి గృహంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు రాయికోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2001-2002 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దీపిక, ఉపాధ్యాయులు రాజేశ్వరి, పూజ అంబిక, పూర్వ విద్యార్థులు హన్మంతురావు, సాయిరాం, రమేష్, అంజనేయులు, మొగులప్ప, తదితరులు పాల్గొన్నారు.

నాగల్‌గిద్దలో

- నాగల్‌గిద్ద: మండల కేంద్రమైన నాగల్‌గిద్ద ప్రాథమిక పాఠశాలలో మంగళవారం యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, శ్వేత, భవాని పాల్గొన్నారు.

ఇటుక బట్టీలు పరిశీలించిన ఏడీ

తూప్రాన్: రావెల్లి శివారులో ఇటుక బట్టీలను జిల్లా మైన్స్ ఏడీ జయరాజ్ మంగళవారం పరిశీలించారు. రావెల్లి గ్రామానికి చెందిన దుర్గారెడ్డి ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నాడు. ఇటుక బట్టీలతో ఇబ్బందులు కలుగుతున్నట్లు కొందరు ఫిర్యాదు చేయడంతో ఏడీ జయరాజ్ ఇటుక బట్టీలను పరిశీలించారు. ఇటుక బట్టీల ప్రాంతంలో కొలతలు నిర్వహించారు. ఏడీ వెంట తూప్రాన్ ఆర్ఐ నాగరాజు ఉన్నారు.

చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 27: నర్సాపూర్ సీడీపీవో పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు మంగళవారం నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ ఉద్యోగులదే కీలక పాత్ర పేర్కొన్నారు. ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పదార్థాలను నిర్లక్ష్యం చేయకుండా అందించాలని సూచించారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని సునీతారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, సీడీపీవో హేమభార్గవి, వైస్ చైర్మన్ నయీముద్దీన్, నాయకులు శేఖర్, సురారం నర్సింలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎంపీపీ జ్యోతిసురేష్‌నాయక్, ఎంపీటీసీ అంజనేయులు గౌడ్ వచ్చేలోపే కార్యక్రమం ప్రారంభమవ్వడంతో అసంతృప్తితో వెనుదిరిగి వెళ్లిపోయారు.

'పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి'

సంగారెడ్డి క్రైమ్, ఫిబ్రవరి 27: బాల సదనంలోని పిల్లల ఆరోగ్యంపై సిబ్బంది శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.హన్మంతరావు సూచించారు. సంగారెడ్డిలోని బాల సదనాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు సరైన సమయంలో భోజనం అందించాలని, ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. పిల్లలు ఏ విధంగా చదువుతున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాల సదనం పరిసరాలు, వంట గదిని పరిశీలించారు. ఆయనవెంట బాల సదనం పర్యవేక్షకురాలు విజయ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయండి


సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 27: అకారణంగా పనిలో నుంచి తొలగించిన మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి యాదగిరి కోరారు. ఈ మేరకు సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధుల నుంచి తొలగించారని చెప్పారు. వారి స్థానంలో ఇతరులను డబ్బులు తీసుకుని నియమించారని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారని యాదగిరి తెలిపారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో మున్సిపల్ యూనియన్ నాయకులు సువర్ణ, రాజు, మల్లేశం, శివ, పాండు, వేణు, ప్రభు, కిరణ్, అనిల్, గణేష్, రాజు, సురేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాల కోసం రేపు సీపీఐ ర్యాలీ

జహీరాబాద్, ఫిబ్రవరి 27: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 29న జహీరాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింహులు తెలిపారు. మంగళవారం ఆయన జహీరాబాద్‌లో మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతంలో ఎందరో నిరుపేదలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్ల స్థలాలు లేని పేదలు సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీకి తరలిరావాలని పిలుపునిచ్చారు. పశువుల మార్కెట్ వద్ద గల ఈద్గా సమీపం నుంచి ర్యాలీ ప్రారంభమై ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయనాయకులు వస్తున్నారని ఆయన చెప్పారు. ప్రజలు, నిరుపేదలు అధికసంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు సన్మానం

చేగుంట, ఫిబ్రవరి 27: బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో ఆనంద్ మేరీకి మంగళవారం నార్సింగ్ మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ సబిత, జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవోను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య పథకాలపై ఒడిశా బృందం ఆరా

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 27: సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఒడిశా బృందం మంగళవారం సందర్శించింది. ఆస్పత్రిలో అమలవుతున్న ఆరోగ్య పథకాలు, కార్యక్రమాలను పరిశీలించారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్, ఆరోగ్య మహిళ, ఎంసీహెచ్ కిట్, న్యూట్రిషన్ కిట్‌తో పాటు తదితర కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వైద్య, ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల వినియోగంపై ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య పథకాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, ఆర్ఎంవో వీరాంజనేయులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


సంగారెడ్డి ఎంసీహెచ్‌ను సందర్శించిన బృందం సభ్యులు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

జహీరాబాద్, ఫిబ్రవరి 27: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్స్‌ను విడుదల చేయకపోవడం తగదన్నారు. అద్దెభవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్న వసతిగృహాలకు సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల, అధ్యాపకుల పోస్టులను భర్తీచేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, సతీష్, రాజేష్, వాణి తదితరులు పాల్గొన్నారు.

డైట్ విద్యార్థుల ధర్నా

హవేళిఘణపూర్: మండల పరిధిలోని ప్రభుత్వ డైట్ కళాశాల విద్యార్థులు మెదక్‌లోని కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. కరోనా కారణంగా 2022లో తమ అడ్మిషన్స్, తరగతులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని, ఇప్పుడు చివరి ఏడాది చదువుతున్నట్లు తెలిపారు. ఏడాది విద్యాసంవత్సరం కోల్పోయిన తమ పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించి డీఎస్సీ రాసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. లేదంటే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయితేజ, రఘువరన్, హరిక్రిష్ణ, షాహిబేగం, రెహమాన్ రాము పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో మాట్లాడుతున్న రజనీకాంత్

బీఆర్ఎస్ పని ఖతం

- బీజేపీ అధికారప్రతినిధి రాణి రుద్రమ దేవి

జోగిపేట/నిజాంపేట, ఫిబ్రవరి 27: రాష్ట్రంలో బీఆర్ఎస్ పని ఖతమైపోయిందని, దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ దేవి అన్నారు. మంగళవారం జోగిపేట, నిజాంపేటలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో ఆమె మాట్లాడారు. ప్రధాని మోదీ చేపట్టిన చర్యల వల్ల దేశం పలు రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే నంబర్ వన్ శక్తిగా ఎదగబోతున్నదన్నారు. మహిళల కోసం ఉచిత గ్యాస్ సిలిండర్ హామీతో పాటు మహిళల కోసం దేశ వ్యాప్తంగా 12 కోట్ల టాయిలెట్లు కట్టించిన ఘనత కూడా మోదీదేన్నారు. మూడోసారి మోదీ ప్రధాని కావాలంటే రాష్ట్రంలో 17 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. జోగిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, వెంకటనర్సింహారెడ్డి, నాయకులు ప్రభాత్ కుమార్, ఎర్రారం సతీష్ పాల్గొన్నారు. నిజాంపేటలో జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, బీజేపీ సీనియర్ నాయకులు వెలుముల సిద్ధరాములు, తీగల శ్రీనివాస్ గౌడ్, చింతల శేఖర్, ఆకుల రమేష్, ప్రశాంత్, పిట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.


నిజాంపేటలో మాట్లాడుతున్న రాణిరుద్రమ

నామినేటెడ్ పోస్టుల కోసం పటాన్‌చెరు నాయకుల పైరవీలు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 27: పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో నామినేటెడ్ పోస్టుల కోసం కాంగ్రెస్ పార్టీలోని ఆశావహులు నాయకుల వద్ద పైరవీలు ప్రారంభించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. స్థానిక నాయకులను సంప్రదించి ఏకాభిప్రాయం కుదిరాకే పోస్టుల భర్తీపై నిర్ధారణకు వచ్చేందుకు శ్రీనివాస్‌గౌడ్ ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు. కీలకమైన పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పోస్టులకు పెద్ద ఎత్తున డిమాండ్ నెలకొంది. చైర్మన్ పదవి ఎస్సీ రిజర్వ్ కావడంతో దళిత నాయకులు పోటీ పడుతున్నారు. ఉస్మాన్‌నగర్ మాజీ ఉపసర్పంచ్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పర్షశ్యాంరావ్, నందిగామ మాజీ సర్పంచ్ శివానందం, పటాన్‌చెరుకు చెందిన సీనియర్ నాయకుడు సామయ్య తీవ్రంగా పోటీ పడుతున్నారు. బీరంగూడా భ్రమరాంబా మల్లికార్జున ఆలయ కమిటీ చైర్మన్ పదవికి అమీన్‌పూర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు భైస సుధాకర్‌యాదవ్ పేరు దాదాపు ఖరారైంది. 13మంది ధర్మకర్తల పేర్లు సైతం ఖరారు కావడంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రుద్రారం సిద్ధివినాయక ఆలయ కమిటీ చైర్మన్‌గా మాజీ సర్పంచ్ కుర్మ వెంకటన్న పేరు ఖరారైంది. నియోజకవర్గ స్థాయి ఆత్మకమిటీ చైర్మన్ పదవికి సైతం పోటీ నెలకొంది. బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవికి జిన్నారం, గుమ్మడిదల నాయకులు పోటీ పడుతున్నారు.

పేదల అభ్యున్నతికి ప్రాధాన్యం

నర్సాపూర్, ఫిబ్రవరి 27: ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉజ్వల యోజన గ్యాస్ పథకం కింద మంజూరు చేసిన 30 మందికి ఉచిత గ్యాస్‌సిలిండర్లను మంగళవారం నర్సాపూర్‌లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బుచ్చేసయాదవ్, బీజేపీ మండలాధ్యక్షుడు నగేష్, పట్టణ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, నాయకులు కంది ప్రభాకర్, భాస్కర్, సాహితి గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి ప్రశాంత్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వచ్చినప్పుడు తీసుకోవల్సిన జాగ్రతలపై ఫైర్‌స్టేషన్ సిబ్బంది అవగాహన కల్పించారు.

'సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి'

పటాన్‌చెరు, ఫిబ్రవరి 27: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాలనీల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం జేపీ.కాలనీ, ముదిరాజ్‌బస్తీ ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఆధునిక పద్ధతిలో భూగర్భ డ్రైనేజీని నిర్మిస్తున్నామన్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

- రామచంద్రాపురం: భారతీనగర్ 111, 112 డివిజన్‌లో కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి, పుష్పనగేష్ పర్యటించారు. మురుగు నీరు సహజంగా ప్రవహించేలా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. వారివెంట జీఎం రాజశేఖర్, డీజీఎం శివకుమార్, ఏఈ జనార్ధర్ ఉన్నారు.

అవినీతి చైర్మన్‌కు ఎర్రోళ్ల శ్రీనివాస్ మద్దతా?


మాట్లాడుతున్న తూప్రాన్ మున్సిపల్ కౌన్సిలర్లు

తూప్రాన్, ఫిబ్రవరి 27: అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్, ఆయనకు మద్దతు తెలుపుతున్న కౌన్సిలర్లకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మద్దతుగా నిలవడం విస్మయం కల్గిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రత్యేక క్యాంపులో కౌన్సిలర్లతో ఉన్న ఆయన మంగళవారం మీడియాకు వీడియో విడుదల చేశారు. చైర్మన్ అరాచకాలకు విసుగు చెందిన కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ స్వచ్ఛందంగా అవిశ్వాసానికి మొగ్గు చూపారని తెలిపారు. దళిత కౌన్సిలర్ కుటుంబాన్ని వేధిస్తున్నారని ఎర్రోళ్ల శ్రీనివాస్ కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. చైర్మన్ అవినీతిపై చర్చించేందుకు ఎర్రోళ్ల శ్రీనివాస్ తూప్రాన్‌కు రావాలని సవాల్ చేశారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి


బూర్గుపల్లిలో తపాలా శాఖ సేవలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 27: గ్రామీణ ప్రాంత ప్రజలందరూ ఒక్కరూ తపాలా శాఖలో ఖాతాదారులుగా చేరి, తపాలా శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి సబ్ డివిజన్ తపాలా శాఖ మెయిల్ ఓవర్సీస్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బూర్గుపల్లిలో ఐపీపీబీ అకౌంట్‌పై అవగాహన కల్పించారు. తపాలా శాఖలో ప్రస్తుతం అన్నిసేవలు ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మండల బీపీఎంలు ప్రశాంత్, మానయ్య, గంగారాం, రాఘవేందర్, తుకారం, సుదర్శన్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి అఖిలేష్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 27: సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి అఖిలేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు భయానికి లోనుకాకుండా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని సైకాలజిస్ట్ నళిని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి విజయలక్ష్మి, చక్రపాణి, మధుమోహన్, కల్పన, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు తారాబాయి, శంకర్, కార్యాలయ పర్యవేక్షకులు శంకరయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ జయంతి ముగింపు వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నశంకరంపేటలో సేవాలాల్ మందిర ఏర్పాటుకు అరెకరం భూమి, మందిర నిర్మాణానికి రూ.10లక్షలు ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మోహన్ నాయక్, రవిచంద్, గణేష్, మాజీ సర్పంచులు శ్రీమాన్‌రెడ్డి, రాజీరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్, సొసైటీ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంగ్యా నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి భగలాముఖి ఆలయ వార్షికోత్సవం

శివ్వంపేట, ఫిబ్రవరి 27: శివ్వంపేటలోని భగలాముఖి అమ్మవారి మొదటి వార్షికోత్సవాన్ని బుధవారం నుంచి నిర్వహించనున్నారు. అందుకు ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఆలయం వద్ద అన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. 28న గణపతిపూజ, పుణ్యాహవచనము, ప్రధానదేవతా మండప స్థాపనాపూర్వకపూజ సాయంత్రం పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. 29న భగలాముఖి మంత్రానుష్టానపూర్వక గంగా గోదావర్యాది పుణ్య తీర్థాలతో అష్టోత్తరశత, ప్రదోష కాలపూజ, మహామంగళనీరాజనం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ట్రస్టు సభ్యులు శివకుమార్‌గౌడ్, మహేష్‌గుప్తా, పురుషోత్తమశర్మ తెలిపారు.

అప్రమత్తతే ఆయుధం.. చోరీలతో జాగ్రత్త: ఎస్పీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 27: జిల్లాలో జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ బాలస్వామి సూచించారు. మంగళవారం ఆయన ఎస్పీ మాట్లాడుతూ.. ఊళ్లకు వెళ్తున్న వారు తప్పకుండా ఇంటి పక్కవారికి లేక పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలా చేస్తే పోలీసులు గస్తీ తిరుగుతారని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దుకాణాల్లో విలువైన వస్తువులు, డబ్బులను ఉంచకూడదన్నారు. ప్రధాన చౌరస్తాలు, షాపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచించారు.

వోక్సన్ యూనివర్సిటీలో సైన్స్ సంబురాలు

మునిపల్లి, ఫిబ్రవరి 27: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని కంకోల్ గ్రామ శివారులో గల వోక్సన్ యూనివర్సిటీలో విజ్ఞానశాల సైన్స్ సంబురాలను నిర్వహించారు. ఈ సంబురాల్లో బుదేరా జడ్పీహెచ్ఎస్ మొదటి బహుమతిని అందుకున్నది. రెండో బహుమతి సదాశివపేట ప్రభుత్వ పాఠశాలకు దక్కింది. గెలుపొందిన విద్యార్థులకు ప్రముఖ శాస్త్రవేత్త జీసతీష్‌రెడ్డి, సైంటిఫిక్ అడ్వైజర్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ పాల్గొని బహుమతులను అందజేసి, విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు.

బోనాల పండుగ

పాపన్నపేట, ఫిబ్రవరి 27: మండల కేంద్రమైన పాపన్నపేటలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా రేణుకామాత ఆలయానికి వెళ్లి సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రత్యేక పూజలు చేశారు.

చిల్వర్‌లో

అల్లాదుర్గం: మండలంలోని చిల్వర్ గ్రామంలో ఎల్లమ్మకు భక్తులు మంగళవారం ఘనంగా బోనాల పండుగ చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు.

నార్సింగ్‌లో

చేగుంట: నార్సింగ్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి, గౌడ సంఘం నాయకలు స్వామిగౌడ్. శంకర్‌గౌడ్, మల్లేశంగౌడ్, సిద్ధిరాములుగౌడ్, పరశురాములుగౌడ్, నారాగౌడ్, ఎల్లాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలారం బాబు, నాయకులు శ్రీపతిరావు, అశోక్, భూపతి రాజు పాల్గొన్నారు.


పాపన్నపేటలో బోనాల ఊరేగింపు


నార్సింగిలో ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ వార్షికోత్సవం

సంగారెడ్డి అర్బన్: పట్టణ శివారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భందా ఆలయ కమిటీ అధ్యక్షుడు తోపాజి అనంతకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.